క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

తిరుమలగిరి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించే ప్రజా ప్రతినిధుల వీడ్కోల్ సమావేశానికి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరుకానున్నట్లు ఎంపీడీఓ లాజర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అర్వపల్లి : అర్వపల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక వసతి గృహం సంక్షేమ అధికారి కాటూరి రామానుజాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వసతిగృహంలో 100సీట్లకు గాను ఇప్పటి వరకు 28సీట్లు భర్తీ అయ్యాయని, 72సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


ఎస్‌కె.అస్లాతబసుం


మల్లేపాక మేఘన

నాగారం : మండల పరిధిలోని పసునూర్ మోడల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థిని ఎస్‌కె.అస్లాతబసుం, జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన మల్లేపాక మేఘన బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కుంట రమేష్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం ఆర్.రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ

పెన్‌పహాడ్ : ఉపాధిహామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏపీఓ రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి, జామ, సపోటా, నిమ్మ, కొబ్బరి, ఆయిల్‌పామ్, జీడి మామిడి పంటలకు మూడు సంవత్సరాల వరకు ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహణ ఖర్చులు అందజేయనున్నట్లు వెల్లడించారు. రైతులు ఈ పంటలు సాగు చేయడానికి సిద్ధంగా ఉంటే దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుకు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, చిన్న, సన్నకారు రైతు సర్టిఫికెట్, ఉపాధిహామీ జాబ్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని కోరారు.

పాఠశాలలకు రాగిపిండి, బెల్లం పంపిణీ

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం రాగిజావ పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా బుధవారం అర్వపల్లిలోని ఎమ్మార్సీకి రాగిపిండి, బెల్లం బస్తాలు చేరాయి. దీంతో అధికారులు పాఠశాలల వారీగా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని 30ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు గాను 1600మంది విద్యార్థులకు 15రోజుల పాటు సరిపడా 200కిలోల రాగిపిండి, 200కిలోల బెల్లం వచ్చినట్లు ఎంఈఓ బి.బాలునాయక్ తెలిపారు. రాగిజావ ఉదయం వేళలో విద్యార్థులకు అందించాలని హెచ్‌ఎంలకు ఆయన సూచించారు.

హత్రాస్ బాధితులకు న్యాయం చేయాలి

చివ్వెంల : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హత్రాస్ జిల్లా పూల్‌రాయ్ గ్రామంలో సత్సంగ్ తొక్కిసలాటలో మృతి చెందిన 122కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మొల్గూరి సైదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. యూపీ ప్రభుత్వం ఘటనపై పూర్తి విచారణ చేపట్టాలని, మృతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియో, గాయపడిన వారికి రూ.10లక్షల ఆర్థికసాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన సీడబ్ల్యూసీ అధికారులు


పాఠశాల నిర్మాణ పనుల్లో పాల్గొన్న బాలకార్మికులను తీసుకెళ్తున్న అధికారులు

చివ్వెంల : మండలంలోని బీబీగూడెం గ్రామ శివారులో నిర్మిస్తున్న శ్రీచైతన్య పాఠశాలను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) అధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చిన కార్మికులతో పాటు, బాల కార్మికులతో పాఠశాల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు సోషల్ మీడియాలో కొంత మంది యువకులు పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. దీంతో కలెక్టర్ ఆదేశాలతో లేబర్, సీడబ్ల్యూసీ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి ఇద్దరు బాల కార్మికులను గుర్తించి సూర్యాపేటలోని బాలభవన్‌కు తరలించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ, లేబర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వంతెనలపై రక్షణ కరువు


పెన్‌పహాడ్ సమీపంలో కల్వర్టుపై రక్షణ గోడలేక పొంచి ఉన్న ప్రమాదం


సింగారెడ్డిపాలెం గ్రామశివారులో రక్షణ గోడ లేని కల్వర్టు

- రహదారికి ఇరువైపులా కానరాని రక్షణ గోడలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

పెన్‌పహాడ్ : మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఒక వైపు రహదారులు సరిగా లేకపోవడం, మరోవైపు వంతెనలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు రక్షణ గోడలు లేక నిత్యం ప్రజలు భయాందోళన నడుమ ప్రయాణాలు సాగించాల్సివస్తుంది. ముఖ్యంగా రాత్రివేళల్లో ప్రయాణించాలంటే వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే రహదారుల్లో అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయమై వాహనదారులు అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సూర్యాపేట–గరిడేపల్లి ప్రధాన రహదారిలోని సింగారెడ్డిపాలెం గ్రామశివారులోని కల్వర్టుపై, మండల కేంద్రంలోని శివారులోని కల్వర్టులపై రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం ఈ రహదారిపై వేలాదిగా వాహనాలు రాకపోకలు కొనసాగిస్తున్నాయి. రోడ్ల నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్లు కల్వర్టులపై రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టులకు రక్షణ గోడలు లేక వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదబారిన పడుతున్నారు. ఈ మార్గాలలో కొత్తవారు రాత్రి సమయంలో ప్రయాణిస్తే ప్రమాదాలబారిన పడే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టులపై రక్షణ గోడలు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

రక్షణ గోడలు ఏర్పాటు చేయాలి

సూర్యాపేట–గరిడేపల్లి ప్రధాన రహదారిలోని సింగారెడ్డిపాలెం గ్రామశివారులో, మండల కేంద్రంలోని శివారుల్లో ఉన్న కల్వర్టులకు రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రోడ్ల నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్లు కల్వర్టులపై రక్షణగా గోడ నిర్మించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

– వెంకన్న, సింగారెడ్డిపాలెం

పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ఆర్‌అండ్‌బీ రహదారుల కల్వర్టులపై రక్షణ గోడలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఏఏ కల్వర్టుల వద్ద రక్షణ గోడలు లేవో వాటిని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం.

– యుగేంధర్, ఆర్‌అండ్‌బీ ఏఈ

ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలి


జ్యూట్ బ్యాగులు అందజేస్తున్న గండూరి కృపాకర్

సూర్యాపేట : ప్రజలు పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నివారించాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. ఇంటర్నేషనల్ ప్లాస్టిక్ బ్యాగ్ ఫ్రీ డే సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 45వ వార్డులో ఆయన బుధవారం జ్యూట్ బ్యాగులను పంపిణీ చేసి మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందని, డ్రెయినేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరడంతో దోమలు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆయన అన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం వార్డు ప్రజలతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఉప్పల వెంకటాచారి, తాప్సి రామచంద్రయ్య, జడిగల శేఖర్, ఎండీ లతీఫ్, కందిబండ లక్ష్మి, గుండా సరస్వతి, జడిగల ఎల్లమ్మ, సోమలింగయ్య, బాజి, కుక్కడపు భిక్షం, కళ్యాణ్, సందీప్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ సుంకరి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీస్ కళాబృందంతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి స్కూల్ కాలేజీలలో చదువుకునే విద్యార్థులు ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ నేరగాళ్లతో మోసాలకు గురికావద్దని, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దు, ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులై మెసేజీలలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దని కోరారు. అనంతరం పోలీసు కళాబృందం వారు ఆట పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రాజశేఖర్, సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ మహేంద్రనాథ్, సైబర్ సెక్యూరిటీ ఎస్ఐలు రాజశేఖర్, అశోక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఎం.సైదులు, కానిస్టేబుల్ సైదులు, కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపి, కృష్ణ, చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

నాగారం : మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో ఎస్సారెస్పీ 71డీబీఎం ఉపకాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ బుధవారం బాధిత రైతులు మండల కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. 2010 ఎస్సారెస్పీ 71డీబీఎం ఉపకాలువ నిర్మాణంలో భాగంగా తమ విలువైన భూములను కోల్పోయామని, దీనికి సంబంధించిన అప్పటి ప్రభుత్వ అధికారులు నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకున్నారని, దాదాపు పుష్కర కాలం గడిచినా నేటికి నష్టపరిహారం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పట్టాభూములను అసైన్డ్, బంజరాయి భూములుగా రికార్డుల్లో నమోదు చేసి ప్రభుత్వ సాయం అందకుండా చేశారని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలు కూడా నోచుకోలేదన్నారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని పలుమార్లు విన్నవించినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు యారాల రాంరెడ్డి, ఆకుల వెంకటయ్య, బుర్ర యాదగిరి, వేదం శంకయ్య, పూలమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ జరపాలని ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

సూర్యాపేటటౌన్ : ఆత్మకూరు మండల కేంద్రంలోని ఎస్సీహాస్టల్‌లో ఉంటున్న 7వతరగతి విద్యార్థి శ్యామ్ మృతి పట్ల సమగ్ర విచారణ జరపాలని ఆయా విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్‌వర్మ, వీరబోయిన లింగయ్యయాదవ్, రవి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో విద్యార్థి బంధువులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థి మృతి పట్ల అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా ఆస్పత్రికి తరలించడం ఏంటని ప్రశ్నించారు. వార్డెన్, వాచ్‌మెన్, కేర్‌టేకర్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వార్డెన్‌ను సస్పెండ్ చేసి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, తాళ్ల వినయ్, యాతాకుల ప్రవీణ్, వేణు, వెంకట్ ఉన్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పాలకులపై పోరాడాలి


నూతనకల్ : మాట్లాడుతున్న పేర్ల నాగయ్య

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ పాలకులపై పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పేర్ల నాగయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత అన్యాయాలపై ఉద్యమించాలని కోరారు. నేడు తుంగతుర్తిలో నిర్వహించే కొమురయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అరుణోదయ సాంస్కృతిక సారధి జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య, బాణాల వెంకట్‌రెడ్డి, నరేష్, విజయ్ తదితరులు ఉన్నారు.

తుంగతుర్తి : మండల కేంద్రంలో నేడు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే దొడ్డి కొమురయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్ కోరారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త దొడ్డి కొమురయ్య నడిపిన ఉద్యమస్ఫూర్తితో పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు వేర్పుల లక్ష్మయ్య, ఇప్ప్యా జిల్లా కమిటీ సభ్యులు కర్ణాకర్, మామిడి సుధాకర్, మీనయ్య, పీవైఎల్ నాయకులు పరశురాం, పీడీఎస్‌యు నాయకులు విజయ్ ఉన్నారు.

మద్దిరాల : తుంగతుర్తి పట్టణంలో నేడు నిర్వహించే దొడ్డి కొమురయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని రెడ్డిగూడెంలో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సుధాకర్, శేఖర్, రమేష్, సతీష్, కనకమ్మ, సోమయ్య పాల్గొన్నారు.

ఖమ్మం సభను విజయవంతం చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : ఖమ్మం పట్టణంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించే దొడ్డి కొమురయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ డివిజన్ నాయకుడు డేగల వెంకటకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పోరెండ్ల దశరథ, శ్రీను, మల్సూర్, నర్రా శేషయ్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ఖమ్మం జిల్లా కేంద్రంలో నేడు జరిగే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య కోరారు. బుధవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు బయ్యం లింగయ్య, యానాల సుధాకర్‌రెడ్డి, గండ్ర కళింగారెడ్డి, ఏషబోయిన లింగయ్య, పడిశాల సంజీవ్, మర్రిపల్లి సతీష్, కాసం పవన్, ఎలమకంటి రాజు, అంకిరెడ్డి సైదులు, పెరమల్ల నర్సయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఎదుగుదలను ఓర్వలేకనే నిరసన

నూతనకల్ : ఎమ్మెల్యే మందుల సామేల్ ఎదుగుదలను, మంచితనాన్ని చూసి ఓర్వలేకనే సొంత పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేయడం సిగ్గుచేటని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నకిరేకంటి మధు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత పార్టీ వారే నిరసన తెలపడం పట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. నియోజకవర్గంలో రాకీయాలకు అతీతంగా మంచితనం కలిగిన ఎమ్మెల్యేను 50వేల పైచిలుకు మెజార్టీతో గెలిపించారని అన్నారు. ఆయన వెంట మరికంటి రమేష్, నకిరేకంటి రవి, సంజీవ, శ్రీను, వెంకటేష్ ఉన్నారు.

ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


తుంగతుర్తి : ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు

సూర్యాపేట : ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పథకాలను అందేలా చేస్తూ సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలను చేరవేసే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని, ప్రతినిత్యం ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, ఎంపీటీసీలకు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేశా

తుంగతుర్తి : మండల అభివృద్ధికి తనవంతు కృషి చేశానని ఎంపీపీ గుండగాని కవిత రాములుగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఐదు సంవత్సరాలలో ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా మండల అభివృద్ధికి కృషి చేశానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, జెడ్పీచైర్ పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్‌రావుల సహకారంతో, ఎంపీటీసీలు, అధికారుల ప్రోత్సాహంతో మండలాన్ని అభివృద్ధి చేశామన్నారు. అనంతరం అధికారులు ఎంపీపీని, ఎంపీటీసీలను శాలువాలతో సన్మానించి, మెమోంటోలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీఓ భీమ్‌సింగ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవీందర్‌రెడ్డి

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఘన సన్మానం


తిరుమలగిరి : బదిలిపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు


అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ జెడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీపై వచ్చిన, వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన ఎస్.దుర్గయ్య, వెంకట్‌రెడ్డి, నుస్రత్, ఉమాదేవిని, కొత్తగా వచ్చిన వైవీరావు, డి.నాగరాజు, యాదగిరి, వెంకటేశ్వర్లు, సీమాభేగం, నిర్మలాదేవిలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్, జెడ్పీహెచ్‌ఎస్, పీఎస్‌ల హెచ్‌ఎంలు నర్సింహాచారి, సోమయ్య, ఉపాధ్యాయులు డి.యల్లయ్య, దబ్బేటి యాదగిరి, భూపతి శ్రీనివాస్‌గౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లి : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ బాలునాయక్

ఉత్తమ ఫలితాలు వచ్చేలా చూడాలి

తిరుమలగిరి : పనిచేసిన ప్రతి పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, సోమయ్య, జానయ్య, సత్తిరెడ్డి, అఖిల్ ఉన్నారు.

వెంకటనర్సయ్య ఆశయ సాధనకు కృషిచేయాలి


నివాళులర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, రైతు కూలీ వ్యవస్థాపక సభ్యుడు అల్లుబెల్లి వెంకటనర్సయ్య ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించిన వెంకటనర్సయ్య 3వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, సురేష్, సుధాకర్, పచ్చిపాల లింగయ్య, మణికుమార్, గణేష్ తదితులు పాల్గొన్నారు.

• హాస్టల్ ఆవరణలో పొదలు




ఆత్మకూర్(ఎం) మండల కేంద్రంలో విద్యార్థి మృతి చెందిన హాస్టల్ భవనం, ఆవరణలో, మరుగుదొడ్ల వెంట పెరిగిన పిచ్చిమొక్కలు

ట్రాక్టర్ వీల్స్‌తో రోడ్డు ధ్వంసం


ట్రాక్టర్ కల్టివేటర్ వీల్స్‌తో ధ్వంసమైన తూర్పుతండా బీటీరోడ్డు

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామ పంచాయతీ ఆవాసం తూర్పుతండాకు వెళ్లే బీటీ రోడ్డు బుధవారం ట్రాక్టర్ కల్టివేటర్ వీల్స్ తగిలి ధ్వంసమైంది. ఇటీవల ఈరోడ్డును రూ.2.10 కోట్లతో బీటీగా మార్చారు. కాగా రోడ్డు ధ్వంసం చేసిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తండావాసులు తెలిపారు.

మేనిఫెస్టోను అమలు చేయాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ 2023అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతల మధు అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఏఓ సుదర్శన్‌రెడ్డికి బుధవారం విద్యార్థి, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను మొదటి సంవత్సరంలోనే భర్తీ చేయాలన్నారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల భృతి రూ.4000 ప్రకటించి యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం పారిశ్రామిక విధానాన్ని తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సమత సైనిక సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి నరేష్, గిరిజన శక్తి అధ్యక్షుడు ధరావత్ వెంకన్న నాయక్, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర నాయకులు సంతోష్‌రెడ్డి, మధు, కృష్ణ, సురేష్ నాయక్, నగేష్, సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.